తిరుపతి వేంకటకవులు గురుతుల్యులు

● సీబీఐ కోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ

చిక్కడపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సాహిత్యలోకంలో తిరుపతి వేంకటకవులు గురుతుల్యులు అని సీబీఐ న్యాయస్థానం పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతీశర్మ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి వెంకటకవులు యాదిలో పేరిట గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ నాగమారుతీశర్మ మాట్లాడుతూ, తిరుపతి వేంకటకవులు అవధాన విద్యను తెలుగునాట దశదిశలా వాప్తి చేసి తెలుగు భాషా సంపదను పెంపొందించారన్నారు. తిరుపతి వెంకటకవులుగా ప్రసిద్ధి పొందిన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, దివాకర్ల తిరుపతిశాస్త్రిలు పలు సంస్కృత తెలుగు భాషా కావ్యాలు రచించారని తెలిపారు. వారు రచించిన పాండవోద్యోగ విజయాలు పౌరాణిక పద్యనాటకం జగత్ ప్రసిద్ధం అని, ఇందులోని కృష్ణరాయబారం పద్యాలు గ్రామీణ ప్రాంతాల సామాన్య ప్రజలు సైతం పాడుకునేలా వ్యాప్తి చెందాయన్నారు. నేటికీ ప్రజలు ఆ నాటకాన్ని ఆదరిస్తున్నారన్నారు.జర్నలిస్ట్ జయసూర్య, గాయకులు జయకృష్ణ, జైహింద్ పాల్గొన్నారు.

ఐహెచ్ఆర్ఓ రాష్ట్ర అధ్యక్షుడిగా మహ్మద్ అఫ్జల్



బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఆర్ఓ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా మహమ్మద్ అఫ్జల్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ నేమ్‌సింగ్ ప్రేమి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఐహెచ్ఆర్ఓ సౌత్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో 45 మంది సభ్యుల రాష్ట్ర ప్యానల్‌ను ఏర్పాటు చేశారు. మానవ హకుక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, ఐహెచ్ఆర్ఓ సౌత్ చైర్మన్ సయ్యద్ కాజీమ్ ఆలీ హష్మీ, నల్గొండ అధ్యక్షుడు సయ్యద్ సల్మాన్ ఖాద్రీ పాల్గొన్నారు.

హుషారుపాటలతో హోరెత్తించిన యువగాయకులు

చిక్కడపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యువ గాయనీగాయకులు తమ పాటలతో త్యాగరాయగానసభలో హోరెత్తించారు. శ్రీరాగభైరవి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గానసభలో జరిగిన కార్యక్రమంలో ప్రఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సహా ఆయన తన సహగాయనీమణులతో పాడిన పాటలను యువ గాయనీగాయకులు ఉత్సాహంగా పాడి వినిపించారు. కామేష్ మాంధా, చంద్రమౌళి, మనోజ్, భరత్‌రాము, దిలావర్, ఇందునయన, అనుపమ, ఆనందిచంద్రిక, స్వప్న తదితరులు పాటలతో ఆహ్లాదపరిచారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా వంశీసంస్థల అధినేత డా. వంశీ రామరాజు మాట్లాడుతూ, బాలసుబ్రహ్మణ్యంతో తమ సంస్థకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.



ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న ఐహెచ్ఎం ప్రిన్సిపాల్ సంజయ్ కే ఠాకూర్ తదితరులు

నేడు, రేపు 'ప్రత్యేక' ఉత్సవం

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబర్‌పేట డీడీ కాలనీలోని కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్ఎం) హైదరాబాద్‌లో ఈ నెల 25, 26వ తేదీలలో లిటిల్ ఇండియా 2025 పేరుతో రెండు రోజుల ప్రత్యేక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఐహెచ్ఎం ప్రిన్సిపాల్ సంజయ్ కే ఠాకూర్ తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవం రెండు రోజులు మధ్యాహ్నం 12.30 నుంచి రాత్రి 10. 30 గంటల వరకు జరుగుతుందన్నారు. అందరికీ ప్రవేశం ఉచితమన్నారు. ఈ ఉత్సవంలో దేశంలోని వివిధ వంటకాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

రాజీవ్ గాంధీ మెమోరియల్ అండర్ 19 టీ 20 క్రికెట్ చాంపియన్ హైదరాబాద్ జట్టు

బర్కత్‌పుర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ మెమోరియల్ అండర్-19 టీ 20 క్రికెట్ చాంపియన్‌గా హైదరాబాద్ జట్టు నిలిచింది శుక్రవారం రాత్రి ఎల్బీ స్టేడియంలో క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనల్ పోటీలో హైదరాబాద్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసి ఓటమి పాలైంది. హైదరాబాద్ జట్టులో కరుణ యాదవ్ 43 బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. చెన్నై జట్టులో అన్ని సైని 33 పరుగులు చేశాడు. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో మాజీ ఎంపీ, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వి హనుమంతరావు. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్‌లు విజేతలకు బహుమతి ప్రధానం చేశారు హైదరాబాద్ క్రికెట్ జట్టు కెప్టెన్ రాహుల్ కార్తీక్ ట్రోఫీ అందుకున్నారు ఈ సందర్భంగా వి.హెచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ పెట్టడం అభినందనీయమని దేశంలో ఆ ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే శంకర్. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఇండియన్ క్రికెట్ జట్టు మాజీ క్రీడాకారుడు ఎమ్మెస్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆది అవినాష్. టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్. తదితరులు పాల్గొన్నారు.

'కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో ఉద్యమిస్తాం'

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయానికి మారు పేరు కర్పూరి ఠాకూర్ అని, ఆయన స్ఫూర్తితో ఉద్యమిస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ పేర్కొన్నారు. కర్పూరి ఠాకూర్ 101వ జయంతి సందర్భంగా శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సమితి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు నారగోని, నగర మహిళా అధ్యక్షురాలు బండారి పద్మావతి, నాయకులు దుర్గేష్, కిషోర్, నరేష్, కరుణాకర్, రాధిక, భాగ్యలక్ష్మి, లక్ష్మి, శారదమ్మ, రవీందర్, నాగమణి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకోవాలి

● ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ ప్రొ.పురుషోత్తమ్

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకుని సామాజిక సాధికారత సాధించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తమ్ అన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో పూలే - అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్, ప్రజా పరిరక్షణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం - సామాజిక సాధికారత' అనే అంశంపై సదస్సు జరిగింది. సదస్సుకు హాజరైన ప్రొ. పుషోత్తమ్ మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రజలందరికీ సమాన హక్కు కల్పించేందుకు భావప్రకటన, స్వేచ్ఛ, సమానత్వం హక్కులు కల్పించిందన్నారు. అయితే రాజ్యాంగ అధికరణపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో ఇంకా వివక్షకు గురవుతున్నారన్నారు. అనంతరం పీపుల్స్ మానిటరింగ్ కమిటీ జాతీయ కన్వీనర్ సత్యబాబు బోస్, రచయిత జిలుకర శ్రీనివాస్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, శ్రీరాంనాయక్, దళిత బహుజన శ్రామిక యూనియన్ కార్యదర్శి నర్సింహ, ఎంహెచ్ఎస్ అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్‌లు మాట్లాడారు. పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ శివలింగం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బానోతు భాస్కర్ నాయక్, దిడ్డి యాదయ్య, కొమ్ము తిరుపతి, రాజేష్‌నాయర్ తదితరులు పాల్గొన్నారు.

చదువు ప్రగతికి మార్గదర్శి కావాలి

చిక్కడపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చదువుకు ప్రగతికి మార్గదర్శి కావాలని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా శుక్రవారం డా. హిప్నో కమాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ స్లమ్ ఏరియాలో పిల్లలకు పోషకాహారం, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. క్లబ్ కోశాధికారి టీఆర్ శోభారాణి, జి.కృష్ణవేణి, ప్రభావతి, జ్యోతిరాజా, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించాలి

● బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

● కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



తులసీరాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్‌ను పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, డాక్టర్ గౌతమ్‌రావు తదిరులు

గోల్నాక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించి మెరుగైన విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలనే ఆసక్తిని తల్లిదండ్రుల్లో పెంపొందించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గోల్నాక డివిజన్ తులసీరాంనగర్(లంక)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కిషన్‌రెడ్డి సందర్శించారు. పాఠశాల దుస్థితిని పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు నోటుబుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది మెరుగైన విద్యనందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించేందుకు ముందుకు రావాలన్నారు. కేంద్రమంత్రిగా పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. తాను ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సొంతంగా తులసీరాంనగర్ పాఠశాలలో టాయిలెట్స్ శుభ్రం చేయించే కార్యక్రమం చేపట్టాన్నారు. పాఠశాలలోని సమస్యలను పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణా యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌గౌతమ్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్ యాదవ్, అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నాయకులు మూల రవీందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, కన్నె రమేష్‌యాదవ్, ఏడెల్లి అజయ్‌కుమార్, కేసరి నర్సింగ్‌రావుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి: కిషన్ రెడ్డి

ముషీరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సిద్ధిపేటలోని కొండపోచమ్మ జలాశయంలో ఈతకు వెళ్లి అన్నదమ్ములు ధనుష్, లోహిత్‌మృతి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తూ వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ ఇందిరా నగర్‌లోని మృతుల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులు నర్సింగ్‌రావు, జ్యోతిలను పరామర్శించారు. కుటుంబ వివరాలు, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తమకు ఎలాంటి ఆర్థిక స్తోమత లేదని, ఇల్లు కూడా లేదని, ఉన్న ఇద్దరు కుమారులు మృతి చెందారని బాధితులు బోరుమన్నారు. ఉద్యోగం, ఇల్లు ఇప్పించాలని మంత్రిని వేడుకున్నారు. బాధితులను ఆదుకుంటామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ హుస్సేన్ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సభ్యుడు నందగిరి నర్సింహ, కార్పొరేటర్ రవిచారి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు ఆర్టీసీ లక్ష్యం: ఆర్ఎం

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు మెరుగైన సేవలందించడం ఆర్టీసీ లక్ష్యం అని ఆర్ఎం సుచరిత అన్నారు. శుక్ర వారం కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రైవర్స్ డే వేడుకలు నిర్వహిం చారు. ఆర్టీసీ డ్రైవర్లకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ, ప్రమాదాల నివారణలో ఆర్టీసీ డ్రైవర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆర్టీసీ సిబ్బంది రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా సంస్థ బలోపేతానికి పాటుపడాల న్నారు. ప్రతి సంవత్సరం జనవరి 24ను డ్రైవర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో బర్కత్‌పుర ఆర్టీసీ డీఎం ఆర్.మంజుల, కాచిగూడ డీఎం రఘు, ముషీరాబాద్ డీఎం కిషన్, కల్యాణి, చందర్, శివలీల తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎం సుచరిత

'చర్చి వద్ద కొనసాగుతున్న పోలీసు బందోబస్తు'

చిక్కడపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చివద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. గురువారం హెబ్రోన్ సొసైటీకి చెందినరాగి వీరాచారి తన అనుచరగణంతో చర్చిలోనికి వెళ్లి లోపలినుంచి గేటుకు తాళం వేయడంతో ఉద్రిక్తతకు దారితీసిన విషయం విదితమే. ఇరువర్గాల వారు చర్చి వద్దకు చేరుకోవడంతో చిక్కడపల్లి పోలీసులు జోక్యం చేసుకుని ముందస్తు చర్యలు చేపట్టారు. శుక్రవారం కూడా పోలీసు బందోబస్తు కొనసాగింది. ఈ విషయంపై చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్‌రాజునాయక్‌ను వివరణ కోరగా, చిక్కడపల్లి పీఎస్‌లో చర్చికి చెందిన ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయన్నారు. కాగా, క్రైస్తవ భక్తులు, పాస్టర్లు, దైవసేవకులు శుక్రవారం చర్చిలోకి వెళ్లి ప్రార్థనలు చేసి బయటకు వచ్చారు. చర్చి వద్ద అంతా ప్రశాంతంగానే ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు..

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, సేవాభావం పెంపు

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సేవాభావాన్ని పెంపొందిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలోని ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ దేశభక్తితో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్, ఎన్‌సీసీ అధికారి ఎంకిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దక్కన్ బ్రహ్మ సమాజ్ మందిరం శతాబ్ధిఉత్సవాలు

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దక్కన్ బ్రహ్మ సమాజ్ మందిరం శతాబ్ది ఉత్సవాలు ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు కేశవచంద్ తెలిపారు. శుక్రవారం బర్కత్‌పురలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శనివారం హనుమాన్ టేకిడీ బ్రహ్మమందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.



తెలంగాణ బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

బర్కత్‌పుర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. 25 జిల్లాల నుంచి వచ్చిన ప్రైవేట్ స్కూల్స్ ప్రతినిధులు ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కత్తి వెంకటస్వామి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపతిశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జంగం మల్లారెడ్డి, కోశాధికారిగా జె.శ్రీనివాస్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుజ్జ సత్యం, షేక్ షరీఫ్, కె.దయాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.జనార్ధన్‌రెడ్డి, సలహాదారులుగా రాధాకృష్ణ, టి.బుచ్చిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, సత్తిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఏఐసీసీ ఓబీసీ నేత వెంటకస్వామి నూతన కార్యవర్గాన్ని అభినందించారు.



'చేతనా శిల్పం' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెలుదండ నిత్యానందరావు, ధూళిపాళ అరుణ తదితరులు

'చేతనా శిల్పం' పుస్తకావిష్కరణ

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మూసీ సాహిత్య ధార, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి ధూళిపాళ అరుణ రచించిన 'చేతనా శిల్పం' కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ శుక్రవారం సుందర య్యవిజ్ఞాన కేంద్రంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ, మృతదేహాల దహనం, ఉరి తీయడం వంటి వృత్తుల వారిని సహితం తన కవితల ద్వారా సమాజానికి తెలియజేయడం గొప్ప విషయమని రచయిత్రి అరుణను ప్రశంసిం చారు. కార్యక్రమంలో దాస్యం సేనాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు, కవి డాక్టర్ రూప్‌కుమార్, నిహారిని, శ్రీరాములు, దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే కాలేరు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గోల్నాక డివిజన్ తులసీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎ.సురేష్‌గౌడ్ రూపొందించిన నూతన సంవత్సరం-2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాలేరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఒక్క ఉచిత బస్సు సదుపాయం తప్ప మిగతా హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం తీరు, మోసంపై ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టి అధికారంలోకి తీసుకు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పులిజాల గెల్వయ్య, ఆర్కే బాబు, బి.లింగంగౌడ్, భూపతి లక్ష్మణ్, రెడపాక రాము, ముడిగ నర్సింగ్‌యాదవ్, బుచ్చిరెడ్డి, కాలేరు రామకృష్ణ, పడకంటి అంజయ్యచారి, ప్రభాకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సభలకు ఆహ్వానిస్తున్న వారధి సంస్థ ప్రతినిధులు

'వారధి' ఆవిర్భావం.. 27న సమావేశం

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సంఘం, సంస్కృతి, వాణిజ్యం (3సీ) ఈ మూడు ప్రధానాంశాలుగా కార్యకలాపాలు నిర్వహించేందుకు వారధి సంస్థ ఏర్పాటైంది. ఈ సంస్థ ప్రారంభోత్సవాన్ని ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గంజి జగన్ బాబు తెలిపారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలో ఉండే చిన్న వ్యాపారులను అనుసంధానించడానికి తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(టీఏఎంసీసీఐ) సంస్థ పనిచేస్తుందన్నారు. వారధి ప్రారంభోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించామని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మార్గదర్శి సంస్థల ఎండీ శైలజా కిరణ్, సినీ నటుడు సాయికుమార్, పారిశ్రామికవేత్తలు, ప్రముఖ వ్యాపారులు, సంస్కృతి, వాణిజ్య రంగాల ప్రముఖులు హాజరవుతారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





స్వాధీనం చేసుకున్న సామగ్రి, వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

సులభంగా డబ్బు సంపాదించాలని..

నకిలీ యూఎస్ డాలర్లు, నోట్ల ప్రింటింగ్

● నిందితుడి అరెస్ట్

● రూ. 5 లక్షల విలువగల 500 ఫేక్ నోట్లు, ప్రింటింగ్ సామగ్రి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నకిలీ నోట్లు తయారు చేసి సరఫరా చేస్తున్న నిందితుడిని ఎల్బీనగర్ ఎస్ఓటీ, పహాడిషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లా, ఆత్మకూర్ మండలం, అమరచింత గ్రామానికి చెందిన కర్లి నవీన్‌కుమార్ డిప్లొమా ఇన్ మల్టీమీడియా పూర్తి చేశాడు. ఆర్థిక ఇబ్బందులు రావడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు నకిలీ నోట్లు తయారు చేయాలని పథకం వేశాడు. నోట్ల తయారీకి పనికి వచ్చే 45 జీఎస్ఎం పేపర్ కోసం ఇండియా మార్ట్‌లో వెతుకుతుండగా కోల్‌కతాకు చెందిన వ్యాపారి పరిచయం అయ్యాడు. నకిలీ నోట్ల తయారీకి సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చాడు. నోట్ల తయారీ కోసం ప్రింటర్, కలర్స్ కొనుగోలు కోసం కర్నూల్‌లో ఉన్న స్నేహితుడిని నవీన్ సంప్రదించగా అతడు డబ్బు ఇవ్వడంతో ఎపిసన్ ప్రింటర్, కలర్స్ కొన్నాడు. ఈ ప్రింటర్ సాయంతో తీసిన రూ. 500నోట్లు సరిగా రాకపోవడంతో కోల్‌కతా వ్యాపారి నోట్లలో ఉండే కరెన్సీ త్రెడ్‌ను పోలిన పేపర్‌ను నవీన్‌కు పంపాడు. ఆ పేపర్‌తో సెక్యూరిటీ త్రెడ్ తయారు చేశాడు. త్రెడ్‌ను పేపర్లలో పెట్టి కొరియర్ ద్వారా కోల్‌కతా, విజయవాడ, గుజరాత్ పంపించాడు. యూఎస్ డాలర్ వాటర్‌మార్క్ షీట్లను కూడా తయారు చేసి వేర్వేరు ప్రాంతాలకు కొరియర్ చేశాడు.

నోట్‌లకు సంబంధించిన త్రెడ్‌లు సరఫరా చేస్తున్న తరుణంలో కోల్‌కతా వ్యాపారి గుజరాత్‌కు చెందిన వ్యక్తిని పరిచయం చేశాడు. గుజరాత్ వ్యక్తి నవీన్‌ను కలిసేందుకు హైదరాబాద్ వచ్చాడు. నవీన్‌కు కరెన్సీ ప్రింట్ చేసేందుకు ఖరీదైన ప్రింటర్‌ను ఇప్పించాడు. నవీన్‌కు పేపర్ షీట్‌కు రూ.50 చొప్పున 25 లక్షల షీట్ ప్రింట్ చేసి ఇచ్చే ఆర్డర్ కూడా వచ్చింది. గుజరాత్‌కు చెందిన వ్యక్తి ఆర్డర్ మేరకు రూ.500 నకిలీ నోట్లు రూ.5 లక్షల విలువగలవి ప్రింట్ చేశాడు. ఈ నోట్లను డెలివరీ ఇచ్చేందుకు తుక్కుగూడ జంక్షన్‌లో వేచి చూస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ, పహాడిషరీఫ్ పోలీసులు అతడిని పట్టుకున్నారు. నిందితుడు నవీన్ నుంచి నకిలీ రూ.500 నోట్లు, రంగులు, ప్రింటర్, 45 జీఎస్ఎం పేపర్, కలర్స్, గాంధీ బొమ్మ వేసిన స్క్రీన్ ప్రింటింగ్ ఫ్రేములు, సెక్యూరిటీ దారం ఉన్న పేపర్లు స్వాధీనం చేసుకున్నారు.



ఫుట్ ఆంకిల్ కేర్ కేంద్రం ప్రారంభోత్సవంలో వైద్యులు

మధుమేహంతో పాదం సమస్యలు

● నరాలు బలహీనపడితే ఆకారంలో మార్పు

● అందుబాటులోకి ఆధునిక చికిత్స

● అపోలో ఆస్పత్రిలో 'ఫుట్ ఆంకిల్ కేంద్రం ప్రారంభోత్సవంలో వైద్యులు

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాదం, మడమ సమస్యలు ఎక్కువశాతం మధుమేహం కారణంగా వస్తున్నాయని అపోలో ఆస్పత్రి పిల్లల శస్త్రనిపుణుడు డాక్టర్ శ్రీనివాస్ శేషభట్టారు తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో 'ఫుట్ అండ్ ఆంకిల్ కేర్ కేంద్రం' ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నరాలు బలహీనపడినప్పుడు పాదం ఆకారంలో మార్పు వస్తుందన్నారు. దీనికి ఆక్యూట్ చార్కాట్ డిసీజ్ అనే అధునాతన న్యూరోపతి చికిత్స అందిస్తున్నామన్నారు. కింగ్స్ కాలేజ్ ఆస్పత్రి(లండన్) ఫుట్ ఆంకిల్ సర్జన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్స్ అధ్యక్షుడు డాక్టర్ వేణు కవర్తపు మాట్లాడుతూ.. మధుమేహ రోగుల్లో చలనం లోపిస్తే గుండె, మూత్రపిండాల వైఫల్యం, స్ట్రోక్ వంటి సమస్యలకు దారితీస్తుందన్నారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో మినహా భారతదేశంలో మరెక్కడా పాదం, చీలమండ సేవలు అందుబాటులో లేవన్నారు. మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ.. మధుమేహంతో బాధపడే రోగుల్లో చాలామందికి పాదం చీలమండ సమస్యలు ఉంటాయన్నారు. ఫుట్ ఆంకిల్ సర్జన్ వరుణ్ కొమ్మలపాటి, సీఈఓ తేజస్విరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోండి

● వైద్యాధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేని ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, ఫిజియోథెరపీ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులను నడిపించే వ్యక్తులు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ కదిరివన్, అడిషనల్ డీసీపీ మనోహర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకట్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీరంగ్ అబ్కారీ తదితరులు పాల్గొన్నారు.

కేసు నుంచి తప్పించేందుకు లంచం.. ఇన్‌స్పెక్టర్ అరెస్ట్

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేసు నుంచి పేరును తొలగించేందుకు లంచం తీసుకున్న ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎల్. బాలు చౌహాన్ గతంలో ఓ మిస్సింగ్ కేసులో పేరును తప్పించేందుకు బాధితుడి నుంచి రూ. 1.50 లక్షలు డిమాండ్ చేసి రూ. 50 వేలు తీసుకున్నాడు. బాలు చౌహాన్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇతడి అవినీతిపై విచారణ జరిపిన ఏసీబీ అధికారులు, బాధితుడి నుంచి లంచం తీసుకున్న విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. బాలును శుక్రవారం అరెస్ట్ చేసి, నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు.